క్లుప్తంగా

నేటి నుంచి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఎన్నికల ప్రచారం ఎస్.కొత్తపల్లి నల్లవారిపేటలో బుధవారం ప్రారంభించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత అయినవిల్లి వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనాతవరం కూడలి వద్దకు చేరుకుని అక్కడ నుంచి భారీ బైక్ ర్యాలీతో ఎస్.కొత్తపల్లి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దివ్యాంగులు డిజిటల్ సర్టిఫికెట్ పొందాలి

యానాం: గతేడాది డిసెంబర్ 14న పుదుచ్చేరి వైద్యులతో పరీక్షలు చేయించుకున్న దివ్యాంగులంతా తమ డిజిటల్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ సర్టిఫికెట్‌ను ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి వారి నుంచి తీసుకోవాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

యానాం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అనేది బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ అని, అది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులు దగ్గడం, తుమ్మడం, ఉమ్మి వేయడం ద్వారా బ్యాక్టీరియా గాలిలో కలిసి ఆరోగ్యవంతులకు సైతం సోకే ప్రమాదముందన్నారు. అనంతరం నర్సులు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, మదర్‌థెరిస్సా నర్సింగ్ స్కూల్ విద్యార్థులు క్షయవ్యాధి లక్షణాలను తెలిపేలా ప్లకార్డులను ప్రదర్శిస్తూ పట్టణంలోని వీధుల్లో భారీ ర్యాలీని నిర్వహించారు.

దివ్యాంగ చిన్నారులకు మెడికల్ క్యాంపులు

ముమ్మిడివరం: జిల్లాలో 2023–24 సంవత్సరానికి గాను దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వివిధ రకాల ఉపకరణాలు అందించేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా అదనపు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు నేతృత్వంలో ఈ నెల 28 నుంచి క్యాంపులు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 28న రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, 30న ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, వచ్చే నెల 1న రామచంద్రపురం ఎమ్మార్సీ పాఠశాలలో, 2న అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో క్యాంపులు నిర్వహించి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందిస్తామని చెప్పారు. జిల్లాలోని దివ్యాంగ చిన్నారులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



పెదపట్నంలో ఆలయ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర, ఆంజనేయస్వామి వార్ల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, ప్రధాన మండపారాధన, అంకురారోహణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలను వేద పండితులు వైభవంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. 28వ తేదీ గురువారం ఉదయం 9.36 గంటలకు స్వాతీ నక్షత్రయుక్త వృషభ లగ్నంలో విష్ణ్వేశ్వర ప్రయుక్త సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నేడు వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టివారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆవాహిత మండపాలకు పునఃపూజ, హోమాలు జరిపించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు చెప్పారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- గుడ్డివానిచింతలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం



గుడ్డివానిచింతలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం మండలంలోని గుడ్డివానిచింత సత్యకస్తూరి ఫంక్షన్ హాలులో మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో గ్రామంలో అవినీతి పాలన జరిగేదన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి అరాచకాలకు అడ్డుకట్ట పడి వలంటీర్ సాయంతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ నెల 28న మండలంలోని తాడికోన గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, బీసీ సెల్ అధ్యక్షులు యల్లమిల్లి బోస్, గృహసారథుల కన్వీనర్ తిక్కా వెంకటప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



పశువుల్లంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్



ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ వృద్ధురాలిని కోరుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పశువుల్లంకలో ఎన్నికల ప్రచారం
- బ్రహ్మరథం పట్టిన ప్రజలు

ఐ.పోలవరం: సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పశువుల్లంకలో గోడివారిపేట, అంబటివారిపేట, పెదపేటవారిపేటల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపలో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తొలుత మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పశువుల్లంక గ్రామ ముఖ ద్వారం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతున్నాయని చెప్పారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మురమళ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకర నాగబాబు, ఢిల్లీ నారాయణ, పెయ్యల చిట్టిబాబు, నందిగ సుదర్శన్, నేరేడిమిల్లి శ్రీరామమూర్తి, కాశీ రాజుబాబు, పెన్మత్స వాసురాజు, చిరంజీవి, సలాది రామచంద్రరావు, ఏలూరి ఆదినారాయణ, కాటం సత్తిరాజు, కాదా గోవిందు, ధూళిపూడి నాగు, పెమ్మాడి బాబూరావు, చింతా వెంకటేశ్వర్లు, తోట మాణిక్యం, మోర్త చిన్నా, మోకా రవి, శివ, వడ్డి గౌతమ్, ఉందుర్తి ఈశ్వరిబాయి తదితరులున్నారు.

బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చుట్టుగుల్ల పుణ్యవతి, తవిటిక మంగాదేవిల కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంత్రి విశ్వరూప్ మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. బాధితులను దాతలు సహాయం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కరాటం ప్రసన్న, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి హరి రామ్‌గోపాల్, కరాటం దొరబాబు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఉప సర్పంచ్ రేలంగి శ్రీను, ఉండ్రు బాబ్జి, దుర్గారావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్సీలకు గజమాలతో సత్కారం



మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి, ఇజ్రాయిల్‌లను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో పట్టణ కార్యకర్తల సమావేశం అనంతరం అమలాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లను కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీతో గెలవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని నాని, కౌన్సిలర్లు నాగావరపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, అమలదాసు గోవిందు, కట్టోజు నన్నయదాసు, కొల్లాటి దుర్గాబాయి, యండమూరి గంగా తదితరులు సత్కరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పశువుల్లంకలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: మండలంలోని జి.మూలపొలం, యర్రగరువు గ్రామాల నుంచి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సమక్షంలో సుమారు 50 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం పశువుల్లంకలో ఎమ్మెల్యే పొన్నాడ ఎన్నికల ప్రచారంలో యర్రగరువు, జి.మూలపొలం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పొలెపు దుర్గా ప్రసాద్, కాగిత ప్రసాద్, మోర్త వరదరాజు, నిమ్మిత ఈశ్వరరావు, మల్లాడి శ్రీనివాసరావుతో పాటు పలువురికి ఎమ్మెల్యే పొన్నాడ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయానికి చిత్తశుద్ధితో కృషి చేసిన వారికి భవిష్యత్తులో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, గగనవీరుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తీవ్ర ఉద్రిక్తత

ముమ్మిడివరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఓ వ్యక్తిపై ఎస్ఐ డి.సురేష్‌బాబు ప్రవర్తించిన తీరుతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం లంకాఫ్‌ఠానేల్లంకలో ఇరువర్గాల మధ్య భూవివాదం నెలకొంది. దీంతో మంగళవారం ఇరు వర్గాలను ఎస్ఐ డి.సురేష్‌బాబు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఈ నేపథ్యంలో జనసేన నాయకుడు గోదశి పుండరీష్ మాట్లాడుతుండగా ఎస్ఐ సురేష్‌బాబు ఏకవచనంతో పిలుస్తూ దురుసుగా ప్రవర్తించి అతడిని అదుపులోకి తీసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న జనసేన, టీడీపీ నాయకులు, పుండరీష్ వర్గీయులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. అదుపులోకి తీసుకున్న పుండరీష్‌ను విడుదల చేయాలని, ఎస్ఐ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపినా వారు సంతృప్తి చెందలేదు. పుండరీష్‌ను వదిలేసి చర్చలను బుధవారానికి వాయిదా వేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. చర్చల్లో టీడీపీ, జనసేన నాయకులు తాడి నరసింహరావు, దాట్ల పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ డిపాజిట్‌గా పది రూపాయల నాణేలు



నామినేషన్ డిపాజిట్‌గా ప్లేటులో పది రూపాయల నాణేలను తీసుకొచ్చిన అభ్యర్థి రామదాస్

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల ప్రకియలో మంగళవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రామదాస్ అనే ఇండిపెండెంట్ అభ్యర్థి పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.కులోత్తుంగన్‌కు అందజేశారు. నామినేషన్ ధరావత్తు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సిన రూ.12,500 సొమ్మును పది రూపాయల నాణేల రూపంలో పెద్ద ప్లేటులో తీసుకొచ్చి అందించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఆ నాణేలను లెక్కించి తీసుకున్నారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన రామదాస్ ఓ లిక్కర్ షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలి పది నాణేలను తీసుకోకుండా పలు చోట్ల తిరస్కరిస్తున్నారని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఆలోచనతోనే అలా చేసినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పొన్నాడ హయాంలోనే చొల్లంగి అభివృద్ధి



చొల్లంగిలో విలేకర్లతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హయాంలోనే చొల్లంగి గ్రామ పంచాయతీలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బూరెల వెంకట్రాజు, గ్రామ మాజీ సర్పంచ్ మాసా శ్రీను, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ వరిపల్లి శివాజీ గణేష్ తదితరులన్నారు. మంగళవారం చొల్లంగిలో విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పొన్నాడ గ్రామంలో సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందజేశారన్నారు. గ్రామానికి రెండు వాటర్ ట్యాంకులు నిర్మించి తాగునీటి సమస్యను తీర్చడంతో పాటు, అంతర్గత రహదారులు నిర్మించారన్నారు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా ఉపయోగంలో లేని డీపట్టా భూములను 40 మంది లబ్ధిదారులకు అందించి ఎంతో మేలు చేశారన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న సుమారు 4 ఎకరాల ఉప్పు భూముల్లో తమకు స్థలాలు ఇవ్వాల్సిందిగా లబ్ధిదారులు కోరగా, ఎమ్మెల్యే పొన్నాడ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారని ఆయా స్థలాలు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల అనంతరం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. అయితే దీనిపై కొంతమంది టీడీపీ నాయకులు గ్రామంలో ఉన్న కొంతమందికి పట్టాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి నిరసన దీక్షలకు ఉసిగొల్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వర్ణ రాజు, కేబుల్ శ్రీను, వారా సూర్యకుమారి, కాశి బుజ్జి, కొంకె గోవిందు, మేడిశెట్టి నూకరాజు, నిమ్మగడ్డ శ్రీను, చింతపల్లి గణపతిరావు, కొత్తగళ్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ



చెముడులంకలో నిర్వహించిన శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)తో పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని చెముడులంక–2 గ్రామ సచివాలయంలో మంగళవారం జాస్ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, డి.మల్లికార్జున్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 259 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు సూచనలు తెలియజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీ పథకం కింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి, ఆరోగ్య ఆశ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: స్థానిక హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తైక్వాండో బెల్ట్ పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులు సాధించారు. ఈనెల 25న మండపేటలో ఒలింపిక్ గేమ్స్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో విద్యార్థులు కె.అనుశ్రీ, కార్తిక్, వీఎస్ కార్తికేయ, వి.గిరిజ, ఆర్ఎస్వీ అఖిల్, జి.జాయ్ కిరణ్, చైతన్య ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకుని పోటీలకు ఎంపికయ్యారు. ఈవిద్యార్థులను టీచర్లు అభినందించారు.

దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వూటుకూరి



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఎన్నికయ్యారు. మంగళవారం బండారులంకలో దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రెండోసారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పిచ్చిక శ్యామ్, పిచ్చిక పోలిశెట్టి, ప్రధాన కార్యదర్శిగా పుత్సల వరదరాజులు, కోశాధికారిగా దైవపు నందయ్య, మీడియా కోఆర్డినేటర్‌గా కార్టూనిస్ట్ మాడా రాము, సంఘం సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. చింతా వీరభద్రేశ్వర రావు, చింతా శంకరమూర్తి, వీర్రాజు, యక్కల మదన్ మోహన్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

నమశ్శివాయం గెలుపునకు కృషి



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరించిన హోంమంత్రి నమశ్శివాయం

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థి, ప్రస్తుత హోంమంత్రి నమశ్శివాయం ఘన విజయానికి కృషి చేస్తానని ఆ కూటమికి మద్దతిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. కూటమి అభ్యర్థి నమశ్శివాయంను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను నమశ్శివాయం దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ యానాం నియోజకవర్గంలో నమశ్శివాయం గెలుపునకు అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికలో నమశ్శివాయం గెలుపు ద్వారా యానాం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు, వివిధ సంక్షేమ పథకాలను తీసుకురావడానికి మంచి అవకాశం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పంటలకు నీరందించాలి

కాకినాడ సిటీ: తాళ్లరేవు మండలం పి.మల్లవరం చిన్న తిప్ప గ్రామంలో 30 రోజులుగా పంట పొలాలకు సాగునీరు అందక వరి పంట ఎండిపోతుందని రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. పంట పొలాలు ఈనిక దశలో ఉన్నాయని, నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. పంట నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. రైతులు డేవిడ్ రాజు, కేవీవీ సుబ్బారావు, అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ముక్కామల వైద్యాధికారి జి.రమ్యశైలజ అన్నారు. మొసలపల్లిలో సురక్ష ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో మూడు కేంద్రాల్లో మంగళవారం జరిగిన పదో తరగతి జీవశాస్త్రం పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట నుంచి 143 మందికి 142, తొండవరం నుంచి 159 మందికి 158, పుల్లేటికుర్రు నుండి 187 మందికి 186 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడు కేంద్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవోలు తెలిపారు.

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర



జాతర సందర్భంగా పుష్పాలతో సుందరంగా అలకరించిన పెద్దింట్లమ్మ ఆలయం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోట మెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. జాతర సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఈ నెల 10 నుంచి అమ్మ వారి 55వ వార్షిక జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 8వ తేదీ వరకు అమ్మ వారి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.